బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించాలి

సీఎండీ బలరాంనాయక్

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, మార్చి 7: బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించాలని, పని సంస్కృతి మెరుగు పడాల్సిన అవసరం ఉందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో జరిగిన 38వ నిర్మాణాత్మక సమావేశంలో సీఎండీ మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు అమ్మకం ధరలు కోల్ ఇండియా ధరల కన్నా, విదేశీ బొగ్గు ధరలతో పోల్చితే ఎక్కువగా ఉంటున్నాయని చెప్పారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ. 12వేల నుంచి రూ. 16 వేలకు చేరుకుంటుందన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తిగా పని గంటలను సద్వినియోగం చేస్తూ యంత్రాలను పూర్తిగా వినియోగించాలన్నారు. గైర్హాజరవుతున్న కార్మికులపై తీసుకునే కఠిన చర్యలకు సహకారం అందించాలన్నారు. కార్మిక సంఘాలు కంపెనీ ఆర్థిక స్థితిగతులు అర్థం చేసుకొని కార్మికులను చైతన్య పరచాలన్నారు. సింగరేణి అభివృద్ధిలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తుంటారని, కంపెనీ అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యతనిస్తే సింగరేణికి మంచి భవిష్యత్ ఉంటుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అనంతరం సమావేశంలో సింగరేణి సీఎండీ గుర్తింపు కార్మిక సంఘం ద్వారా వివరించిన సమస్యలపై చర్యలు తీసుకుంటామని, ఆర్థిక పరమైన సమస్యలపై కమిటీలు వేసి చర్యలు తీసుకుంటామన్నారు.

స్టార్ సమావేశంలో సమస్యల పరిష్కారం

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంతో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నిర్మాణాత్మక స్టాక్చర్ సమావేశంలో 14 ముఖ్యమైన అంశాలపై అవగాహన కుదిరింది. సింగరేణి సంస్థలో చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. గత డైరెక్టర్ సమావేశంలో అంగీకరించిన ఎన్ 1తో పాటు అన్ని అంశాలకు చైర్మన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నట్లు గుర్తింపు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్ తెలిపారు. ఇక్కడ డైరెక్టర్లు కే వెంకటేశ్వర్లు, ఎల్వీ సూర్యనారాయణ, కోల్ మూమెంట్ ఈడీ ఎస్‌డీ ఎం సుభానీ, పర్సనల్ జీఎం కవితా నాయుడు, గుర్తింపు సంఘం నాయకులు రాజ్‌కుమార్, మిర్యాల రంగ య్య, కే సారయ్య, కే వీరభద్ర య్య, వైవీ రావు, సమ్మయ్య, మడ్డి ఎల్ల య్య, అక్బర్ అలీ, వై రామ్‌గోపాల్ ఉన్నారు.

ఆస్ట్రేలియా కంపెనీల ప్రతినిధులతో సమావేశం

హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆస్ట్రేయలియా కంపెనీల ప్రతినిధులతో సీఎండీ బలరాంనాయక్ సమావేశమయ్యారు. సింగరేణి సంస్థ రానున్న కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతుందన్నారు. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 13 కంపెనీల ప్రతినిధులు తమ ఉత్పత్తుల సాంకేతికతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వార వివరించారు. సింగరేణి చేపట్టనున్న వ్యాపార విస్తరణ చర్యలను సీఎండీ వివరించారు. సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, జీఎం కో ఆర్డినేషన్ ఎస్డీఎం సుభాని, మనోహర్,. ఒరిసెంట్, విల్సన్ మైనింగ్, సర్వీసెస్, మైన్సెట్, డీటీ ఎన్ ఏసియా పసిఫిక్, ఆర్ఎం ఈగ్లోబల్, మినరల్ టెక్నాలజీ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు.

ఎల్ ఆర్ఎస్ నిబంధనలు పకడ్బందీగా అమలు

- రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్

పెద్దపల్లి, మార్చి7: ఎల్ఆర్ఎస్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎం దానకిషోర్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ఎల్ఆర్ఎస్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ అరుణ శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ 2020 క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల తప్ప కుండా పాటించాలన్నారు. ఈనెలా ఖరులోపు లేఔట్ క్రమబద్ధీకరణ కోసం పూర్తి ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. చెరువులు, నీటి వనరులు, తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు మాత్రం రెవెన్యూ నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ అర్హత లేని స్థలాలపై చెల్లించిన ఫీజులో 90శాతం రిఫండ్ అవుతుందని,10 శాతం ప్రాసెసింగ్ కోసం తీసుకుంటామని వివరించారు. వీసీలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు డీపీవో వీర బుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు ఆకుల వెంకటేష్, మనోహర్, డీఎల్‌పీవోలు, అధికారులు పాల్గొన్నారు.

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

వైద్య కళాశాలలో ఆకట్టుకున్న 'కాన్వాస్ 26'

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 7: గోదావరిఖని లోని సిమ్స్ వైద్య కళాశాలలో శుక్రవారం రాత్రి కాన్వాస్ 25 పేరుతో నిర్వహించిన కళాశాల దినోత్సవం ఆకట్టుకున్నది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర హిమబిందు సింగ్, కళాశాల అధ్యాపకులు జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించగా వైద్య విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింప చేశాయి. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, వన్ టౌన్ సీఐ భూమేశ్, అధ్యాపక సిబ్బంది, డాక్టర్ అరుణ, డాక్టర్ రాజు, వివిధ విభాగాల అధిపతులు అశోక్, ఓబులేశ్, సల్మా, కల్పన, శ్రీదేవి, అనంతబాబు, తదితరులు ఉన్నారు.

డీజే సౌండ్స్ ఉపయోగిస్తే చర్యలు

రామగిరి, మార్చి 7 : డీజే సౌండ్స్ ఉపయోగించడంపై నిషేధం ఉన్నప్పటికీ రామగిరి మండల పరిధిలో పెళ్లి బరాత్‌లకు ర్యాలీలు, ఇతర కార్యక్రమాలకు డీజే సౌండ్స్ ఉపయోగిస్తూ శబ్ద కాలుష్యం తోపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న డీజే నిర్వాహకులను రామగిరి ఎస్సై చంద్రకుమార్ శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. డీజే సౌండ్స్ ఉపయోగించడం వల్ల వృద్ధులు,గుండె జబ్బులు గల వారికి, చిన్నపిల్లలకి ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు, రానున్న రోజుల్లో పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో డీజే సాంగ్స్ నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా డీజే సౌండ్స్ ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT MANTHANI.
O.S.No. 99 of 2024
Between:
Naraveddi Laxmi
AND ...Plaintiff
Kotha Mallakka & Others
To, ...Defendants.
Kotha Mallakka, D/o. Late Poshalu, 60 yrs, Occ: Household, R/o Ladnapoor Village of Ramagiri Mandal Dist: Peddapalli.
Defendant no.1
NOTICE
Whereas the above named Plaintiff have filed suit for specific performance of agreement of sale dt: 27-08-2024 against the respondent/defendants against you. That the said case is posted on **18.03.2025** for your appearance at 10.30 A.M before the said court.
Therefore you are hereby directed to appear before the said court along with documents to claim your defense if any. Otherwise the matter will be decided ex-parte against you.
" By Order of the Court "
Sd/- **KVLN Hari Babu & B. ANJANEYULU,** Advocates
Manthani. Cell: 9014222255

మహిళా మేలుకో .. ప్రపంచాన్ని ఏలుకో

పెద్దపల్లి : పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

ధర్మారం : తల్లికి పాదపూజ చేస్తున్న పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వప్న రాణి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

పెద్దపల్లి, మార్చి7: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళా మేలుకో..ప్రపంచాన్ని ఏలుకో అని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కే స్వప్న రాణి పిలుపునిచ్చారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్నరాణి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఆటలపోటీలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీజీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తామని టీజీవో జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్ తెలిపారు. సునీల్ రెడ్డి, టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్ రావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లెంకల బ్రహ్మానంద రెడ్డి, కోశాధికారి కే కరుణాకర్, మహిళా ఉపాధ్యక్షురాలు అంజని, ఉపాధ్యక్షుడు ఎండీ సాజిద్ అలీ, సంయుక్త కార్యదర్శి రౌతు ఆలేఖ్య పటేల్, సీడీపీవో కవిత పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

పెద్దపల్లి టౌన్, మార్చి 7 : మహిళా దినోత్సవ స్ఫూర్తితో శ్రామిక మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నుంచి అమరవీరుల స్తూపం వరకు అన్ని రంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలతో ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జీ జ్యోతి మాట్లాడారు. నేడు దేశంలో శ్రామిక మహిళలపై దారుణమైన శ్రమ దోపిడీ జరుగుతుందని, మహిళలపై ఇంటా బయట హింస పెరుగుతుందన్నారు. వీటిని అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీ వనజారాణి, భాగ్యలక్ష్మి, రజిత, ఎస్ రామలక్ష్మి, లక్ష్మి, శారద, సువర్ణ, సులోచన, అమృత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, ఎస్ రవీందర్, ఎస్ వెంకటస్వామి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

దాడుల నివారణలో ప్రభుత్వాలు విఫలం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. పెద్దపల్లిలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ సమావేశానికి హాజరయ్యారు. జిల్లా ప్రెసిడెంట్ విజయ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం పెద్దపల్లి మహిళా పట్టణ, మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆసలరమ, గౌరవాధ్యక్షురాలు మడికొండ ఓదెమ్మ, శనిగర తిరుమల, రాజమ్మ, లక్ష్మి, విజయ, రజిని, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మంథని రూరల్, మార్చి 7: ఆరెంద జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీలత, గీయశోధ్ధిన్, సీఆర్‌పీ మల్లన్నలు పాల్గొన్నారు.

రామగిరి, మార్చి 7 : రామగిరి ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉపాన్యాసాలు ఇచ్చిన మహిళా ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు. ఎంపీడీవో శైలజరాణి, ఎంపీవో ఉమేశ్, ఏపీవో మౌనిక, టీఏలు అఖిల, సుప్రియ, జీపీ కార్యదర్శులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లులకు పాదపూజ

ధర్మారం,మార్చి7: సాయంపేటలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో వారి తల్లులకు పాదపూజ చేయించి, సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ అతని తల్లి మదునమ్మను సన్మానించి, పాద పూజ చేశారు. అనంతరం విద్యార్థులు వారి తల్లులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి రెడ్డి, ఉపాధ్యాయుడు కాట నర్సయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ నరిగే ప్రమీల, మాజీ చైర్మన్ బొడిగ నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్ బద్దం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంథని రూరల్ : సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

పెద్దపల్లి రూరల్ : ర్యాలీ తీస్తున్న మహిళలు

నేడు జాతీయ లోక్ అదాలత్

పెద్దపల్లి, మార్చి7: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశం మేరకు పెద్దపల్లిలోని సీనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కే స్వప్న రాణి శుక్రవారం ప్రకటనలో తెలిపారు, కక్షిదారులు అందరూ తమ తమ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని, లోక్ అదాలతో పరిష్కారమైన కేసులకు పైకోర్టులలో అప్పీల్ ఉండదని స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌లో మోటార్ వాహన చట్టానికి సంబంధించిన కేసులు, వివాహం, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు, భూములకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మున్సిపల్, బ్యాంకులకు సంబంధించిన ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.

ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మహిళలకు ఆటల పోటీలు

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అధికారుల కుటుంబ సభ్యులకు ఎన్‌సీఓఏ క్లబ్‌లో శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు బండి వనజావెంకటయ్య ఆటల పోటీలను ప్రారంభించారు. విజేతలకు ఈ నెల 12న నిర్వహించనున్న మహిళా దినోత్సవంలో బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

పేదింటి అమ్మాయి పెళ్లికి 'అభయ' హస్తం

కోల్‌సిటీ, మార్చి 7: పేదింటి అమ్మాయి వివాహానికి అండగా నిలవాలని అభయ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ వెల్ది కవిత అనంతరాములు కోరారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన తాళ్లపల్లి జోగయ్య-జయ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించారు. పెద్ద కుమార్తె కరుణ ఇంటర్ పూర్తి చేసింది. ఆమెకు ఈనెల 12న వివాహం నిశ్చయమైంది. హైదరాబాద్‌కు చెందిన యువకుడు కట్న,కానుకలు లేకుండా పెళ్లి చేసుకోవడానికి ముందుకు వచ్చాడు. పెళ్లి సంబంధం కుదిరినప్పటికీ ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో ఆ కన్నవారు బెంగ పెట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న అభయ చారిటబుల్ ట్రస్టు.. రూ.15వేల సాయం అందించి మానవత్వంను చాటుకున్నారు. అమ్మాయి తల్లికి మనోధైర్యం అందించారు. ఆమె మాట్లాడుతూ కూతురి వివాహం కోసం ఆరాట పడుతున్న ఆ కన్నవారి భారాన్ని పంచుకుని అమ్మాయి ఇంట పెళ్లి సందడి కోసం మానవతా వాదులు ముందుకు వచ్చి తలా ఓ చేయి వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

పెద్దపల్లి, మార్చి7: ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలుర అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల, మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. బాలుర డెసిడెన్షియల్ పాఠశాలలో భోజన నాణ్యత పరిశీలించారు. మానసిక దివ్యాంగుల కేంద్రంలో వారికి అవసరమైన వసతులు కల్పించాలని, ప్రభుత్వం నుంచి అందించే సహాయ కార్యక్రమాలపై నివేదిక అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. మౌలిక వసతులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

ఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన

పెద్దపల్లి టౌన్, మార్చి 7: పెద్దపల్లి నుంచి కునారం వెళ్లే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్న ఎంపీ పనులను వేగవంతం చేయాలని సెల్‌ఫోన్ ద్వారా రైల్వే అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ప్రయాణంలో ఇబ్బందులు కలుగకుండా సమయపాలనకు కట్టుబడి ఉండాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధ్యానత ఇవ్వాలని సూచించారు.

జ్యోతినగర్(రామగుండం), మార్చి 7: రామగుండం రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులను శుక్రవారం ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడా లని సూచించారు. ప్రజలు సమస్యలను పార్లమెంట్ లో ప్రస్తావించినట్లు తెలిపారు.

హిమోగ్లోబిన్ ప్రాణదాత

పెద్దపల్లి, మార్చి7: రక్తంలోని హిమోగ్లోబిన్ ప్రాణదాత అని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రసన్న కుమారి పేర్కొన్నారు. రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని మెదడుకు ఇతర భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తుందని తెలిపారు. అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న ఫార్మసిస్టులకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మహిళల్లో సగటున 13 శాతం హిమోగ్లోబిన్ ఉండాలని పేర్కొన్నారు. అనీమియా ముక్త్ భారత్‌లో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమన్నారు. డాక్టర్ వాణిశ్రీ, ప్రోగ్రాం అధికారి, సీహెచ్‌వో దయామని, శ్రీనివాస్, ఫార్మసిస్ట్‌లు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

రామగిరి, మార్చి 7 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సి అవసరం ఎంతైన ఉందని రామగిరి పీఎస్ ఎస్సై చంద్రకుమార్ అన్నారు. రెండు రోజులుగా మంథని జేఎన్టీయూ కళాశాల నిర్వహిస్తున్న బీ జోన్ క్రికెట్ పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

కోల్‌సిటీ, మార్చి 7: రామగుండం నగర పాలక సంస్థలో ఇంటి ఇంటికి తిరుగుతూ చెత్తను సేకరించే రిక్షా మహిళా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవా న్ని పురస్కరించుకొని 33వ డివిజన్‌లో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

మంథని, మార్చి 7: మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమీషనర్ మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా వార్డుల్లోని పారిశుద్ధ్య నిర్వాహణ, నీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర సమస్యలుంటే వెంటనే ప్రజల వార్డు ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 1వ వార్డులో నీలయ్య సెల్: 63039 93203, 2వ వార్డులో సురేశ్ సెల్: 89784 07131, 3వ వార్డులో మంగ సెల్:9063845799, 4వ వార్డు లో జితేందర్ సెల్: 7893235113, 5వ వార్డులో బీ శ్రీనివాస్ సెల్: 8106763641, 6వ వార్డులో పోచయ్య సెల్: 77029 78486, 7వ వార్డులో చిరంజీవి సెల్: 9705133593, 8వ వార్డులో సురేందర్ సెల్: 8555887618, 9వ వార్డులో సరిత సెల్: 8790430983, 10వ వార్డులో సదయ్య సెల్: 98491 52125, 11వ వార్డులో తిరుపతమ్మ సెల్: 9603651272, 12వ వార్డులో శివకుమార్ సెల్: 8374669554, 13వ వార్డులో సరోత్తమ్ సెల్: 7386283977లను సంప్రదించి సమస్యలు వివరిస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు.

పట్టణ ప్రజలకు తాగునీరు అందించాలి

మంథని, మార్చి 7: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో తాగునీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని గంగాపురి, శ్రీపాదకాలనీ, శ్రీరామ్‌నగర్‌లలో గత మూడు రోజులు తాగు నీరు సక్రమంగా సరఫరా కాక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గణేష్, బాపు, రవి పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్మారం,మార్చి 7: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ధర్మారం ఏఎంసీలో యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బంజేరుపల్లిలో ఇటీవల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి సరోజ ,తాసిల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీవో అయినాల ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేశ్, ఏఎంసీ చైర్మన్ రూప్లా నాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, బంజేరుపల్లి మాజీ సర్పంచ్ కళ్లెం గంగారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, మార్చి 7 : మండలంలో మొదటి విడుత ఎంపిక చేసిన కోనరావుపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శుక్రవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నదని వెల్లడించారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు, ఏఎంసీ చైర్మన్ గండు సంజీవ్, వైస్ చైర్మన్ కొమ్మ పోశాలు, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహంయాదవ్, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, గృహనిర్మాణ శాఖ డీఈ పరమాచారి, ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు గొట్టిముక్కుల రవీందర్‌రెడ్డి, లోక జలపతిరెడ్డి, కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి, సిరికొండ కొమురయ్య, బండి స్వామి, బొజ్జ శ్రీనివాస్, ఫక్కీర్ మహ్మద్, చుక్కయ్య, మానుమండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎలిగేడు మార్చి 7 : శివపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే విజయరమణరావు భూమి పూజ చేశారు. లబ్ధిదారు ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంబించారు.

'గాయత్రీ' విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు